నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | జనవరి 26, 2024 | www.navatelangana.com

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓటర్ డే



నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా పోలీసు కార్యాలయంలో 14వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని, మహిళలు, పురుషులు, ధనికులు, పేదవారు ఎవరైనా ఓటు విలువ సమానంగా ఉంటుందన్నారు. ఓటు ముందు మనమందరం సమానమని వివరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఐపీఎస్ కాజోల్ సింగ్, ఎస్బి ఇన్‌స్పెక్టర్ బి.సంతోష్‌కుమార్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం కామారెడ్డి జిల్లా కార్యదర్శి నర్సింలు



నవతెలంగాణ-భిక్కనూర్

అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం కామారెడ్డి జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 29న ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పోడు భూముల కోసం కలెక్టర్ కార్యాలయానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ధరణి ద్వారా నష్టపోయిన రైతులు, అసైన్ భూములు రికార్డు లేనివారు ధర్నాలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోశయ్య, లక్ష్మి, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఓటూ కీలకమైనదే..

- ఒక్క ఓటుతో ఏమవుతుందనే భావన వద్దు
- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ఇరు జిల్లాలో జాతీయ ఓటరు దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

నా ఒక్క ఓటుతో ఏమవుతుందిలే అనే భావన ఎంతమాత్రం సరికాదని, ప్రజాస్వామ్య పరిరక్షణలో, మంచి పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటూ ఎంతో కీలకమైనదని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అనంతరం భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సందేశం వినిపించారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజ్యాంగం ద్వారా ప్రసాదించబడిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తోందని గుర్తుచేశారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా ఎన్నికలు జరిపిస్తోందని, ప్రతీసారి వినూత్న పద్ధతులను ప్రవేశపెడుతూ ప్రజలలో చైతన్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే గత ఎన్నికల్లో 80 ఏండ్లు పైబడిన వృద్ధులు, నలభై శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తూ ఓట్ ఫ్రమ్ హెూమ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో మనకు నచ్చిన నాయకులను ఓటు ద్వారా ఎన్నుకునే అవకాశం కేవలం ఓటు హక్కు ద్వారానే సాధ్యమని సూచించారు. అప్పుడే ప్రజాస్వామ్యం మరింతగా పరిఢవిల్లుతుందని సూచించారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో 74.67 శాతం పోలింగ్ నమోదయ్యిందని, అంటే ప్రతి నలుగురిలో కేవలం ముగ్గురు మాత్రమే ఓటు వేశారని కలెక్టర్ వివరించారు. త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఓటరు తప్పనిసరి ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, జాతి, కుల, మత, లింగ, వర్ణ భేదాలు, బడుగు, బలహీన వర్గాలు అనే తేడా లేకుండా పద్దెనిమిదేళ్ల దాటిన పౌరులందరికీ రాజ్యాంగం ఓటు హక్కును ప్రసాదించిందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధంతో ఓటర్లు తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం కల్పించినందున, ఈ హక్కును ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఔన్నత్యం గురించి యువత ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో క్రమం తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్లను, కొత్తగా నమోదైన యువ ఓటర్లను జిల్లా యంత్రాంగం తరపున జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.మకరందు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కె.కృష్ణవేణి, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు, పెద్ద సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ తదితరులు

కామారెడ్డి : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలంలో కొందరికే ఓటు అవకాశముండేదని, మహిళలకు ఓటు హక్కే లేదని అన్నారు. కానీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సమాజంలో ఉన్న అన్ని వర్గాలకు రాజ్యాంగంలో సమానంగా ఓటు హక్కు కల్పించిందని తెలిపారు. గతంలో ఓటు హక్కు 21 ఏళ్ళకు ఉండగా 1989 నుంచి 18 ఏళ్లకు కుదించిందని, ఏడాదిలో నాలుగు సార్లు ఓటరుగా నమోదు చేసుకోవడానికి భారత ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని అన్నారు. ఓటరుగా నమోదు చేయడం, ఓటరు జాబితా రూపకల్పనలో బూతు స్థాయి అధికారుల పాత్ర కీలకమని వారి కృషి వల్లే ఎన్నికలు సజావుగా నిర్వహించగలుగుతున్నామని ఈ సందర్భంగా వారిని అభినందించారు. ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నదని, ఓటింగ్ శాతం కూడా మెరుగయ్యిందని అన్నారు. అనంతరం నూతనంగా ఓటరుగా నమోదయిన యువతీ, యువకులకు కలెక్టర్ ఫోటో ఎపిక్ ఓటరు కార్డులను అందజేశారు. అదేవిధంగా సీనియర్ సిటిజన్లను, దివ్యంగులను, ట్రాన్స్‌జెండర్లను సన్మానించారు. ఓటు ప్రాముఖ్యతపై డివిజనల్, జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో విజేతలకు మెమెంటో, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. అంతకు ముందు కుల, మత వర్గ, బాషా బేధము లేకుండా ఎన్నికలలో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్.డి.ఓ. శ్రీనివాస్‌రెడ్డి, సిపిఓ రాజారామ్, డిపిఓ శ్రీనివాస్, ట్రెజారి అధికారి సాయిబాబ, మత్స్యశాఖ సహాయ సంచాలకులు వరదారెడ్డి, భూగర్భ జల సహాయ సంచాలకులు సతీష్ యాదవ్, కలెక్టరేట్ ఏఓలు అహ్మద్, ఎలక్షన్ పర్యవేక్షకులు సాయి భుజంగం, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి : ఓటరు దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మిల్లింగ్ ధాన్యం గోల్‌మాల్

- వీటి విలువ సుమారు రూ.33కోట్లు
- అధికారుల పరిశీలనలో బయటపడ్డ నిజాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మరాడించేందుకు ప్రభుత్వం రైసుమిల్లులకు అప్పగించిన వరి ధాన్యంలో గోల్‌మాల్ చోటుచేసుకుంది. ధాన్యాన్ని మారాడించి ప్రభుత్వానికి అప్పగించాల్సిన రైసుమిల్లర్ల యజమానులు అక్రమంగా అమ్ముకున్నట్టు తెలుస్తోంది. అధికారులు రైసుమిల్లులను తనిఖీ చేసిన ధాన్యం పక్కదారి పట్టినట్టు అసలు విషయాలు వెలుగుజూశాయి. పక్కదారి పట్టించిన వరి ధాన్యం విలువ.. సుమారు రూ.33 కోట్ల 65 లక్షల 24వేల 521 ఉంటుందని ప్రభుత్వాధికారులే గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు గతవారంలో నిజామాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా వరి ధాన్యాన్ని రైసుమిల్లర్లు అమ్ముకున్న ధాన్యంపై రైతులు డీసీఓ సింహాచలంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. ఇదిలా ఉండగా.. నిజామాబాద్ జిల్లాలో వరి ధాన్యంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టగా.. వర్ని మండలంలోని మెసార్స్ ఎమ్మెస్సార్ ఆగ్రో ఇండస్ట్రీస్‌కు 14,509.57 క్వింటాళ్ల వరి ధాన్యం (విలువ రూ.5కోట్ల 5లక్షల 18 వేల 437), హుమ్నాపూర్ ప్రాంతంలో గల మెసార్స్ రాయల్ ట్రేడింగ్ కంపెనీలో 20,553.37 క్వింటాళ్ల వరి ధాన్యం (విలువ రూ.6,48,51,047), వర్ని ప్రాంతంలో గల మెసార్స్ సర్ ట్రెడర్స్‌లో 13,234.59 క్వింటాళ్ల వరి ధాన్యం (విలువ రూ.4,65,34,089) సత్యనారాయణ పురం ప్రాంతంలో గల మెసార్స్ గంగా రైస్ మిల్లులో 22,840.86 క్వింటాళ్ల వరి ధాన్యం (విలువ రూ.8,09,03,473), నిజామాబాద్ రూరల్ మండలంలోని కలుర్ గ్రామ ప్రాంతంలోని మెసార్స్ శ్రీలక్ష్మీ గణపతి నరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్‌కు కేటాయించిన 11,179.53 క్వింటాళ్ల వరి ధాన్యం (విలువ రూ.3,93,48,034), బోధన్ మండలంలోని శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో గల మెసార్స్ దాదాభాయ్ ఇండస్ట్రీస్‌కు 15,265.06 క్వింటాళ్ల వరి ధాన్యం (విలువ రూ.5,43,69,441) ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్టు విచారణలో తేలింది. అంతేకాకుండా వర్ని మండలంలోని వర్ని ప్రాంతంలో గల మెసార్స్ వసి పారాబైల్డ్ రైస్‌మిల్, పోతంగల్ మండలంలోని కారేగాం గ్రామంలో గల మెసార్స్ ఆర్గం ట్రేడర్స్ రైస్ మిల్లుల యజమానులు రైస్‌మిల్లుల్లో లేకపోవడంతో వారిపైన వారి మండల ప్రాంతంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వరి ధాన్యం ఎగవేతదారులపై జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్, పౌర సరఫరాల కార్పొరేషన్, సంబంధిత డిటిసిపి ద్వారా క్రిమినల్ కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు. డిఫాల్టర్ రైస్ మిల్లులపై కొన్ని కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థినితో లెక్చరర్ అసభ్య ప్రవర్తన

- లెక్చరర్‌ను చితకబాదిన విద్యార్థిని తల్లిదండ్రులు
- నాగిరెడ్డిపేట్‌లో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో కొనసాగుతున్న సిద్ధార్థ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న లెక్చరర్ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలో గల సిద్ధార్థ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న లెక్చరర్ కిషన్ రాథోడ్ అదే కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని కళాశాలలో జరిగిన ఘటనను తల్లిదండ్రులకు చెప్పడంతో మరుసటి రోజు విద్యార్థిని తల్లిదండ్రులు కళాశాలకు చేరుకొని విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కీచక లెక్చరర్‌ను చితక బాదారు. తెలుసుకున్న కళాశాల ప్రధానోపాధ్యాయులు కళాశాలకు చేరుకొని విద్యార్థి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కిషన్ రాథోడ్‌ను కళాశాల నుంచి తొలగించారు. ఉన్నత చదువులు చదివించాలని కళాశాలకు పంపిస్తే పాఠాలు నేర్పాల్సిన ఉపాధ్యాయులే ఈ విధంగా నీచపు ప్రవర్తన ప్రవర్తించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కళాశాల యజమాన్యం ఎలాంటి ఒడిదొడుకులకు తావివ్వకుండా సత్ప్రవర్తన కలిగిన లెక్చరర్లను మాత్రమే విధుల్లో ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- ఎంపీడీవో గోపాలకృష్ణ

నవతెలంగాణ-ఎడపల్లి




మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, అంకితభావంతో పనిచేయాలని ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ, మండల విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మానవ వనరుల విద్యా కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బోధన్ ఎమ్మెల్యే పాఠశాలలను సందర్శించిన సమయంలో ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడం, పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ఉపాధ్యాయులతో పాటు అధికారులు నిర్లక్ష్యం చేయడం పట్ల పాఠశాలల బాలబాలికల తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రానున్న వార్షిక పరీక్షలలో పదవ తరగతి బాలబాలికలు 100శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేసి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు సాయిలు, రమేష్, జోన్స్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల గుర్తింపు

నవతెలంగాణ-నిజాంసాగర్



బడిబయటి పిల్లల గుర్తింపు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీధర్, నర్సింలు ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ సమక్షంలో బడిబయట పిల్లల సర్వేను గురువారం నిర్వహించారు. అందులో భాగంగా ఆరు సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల మధ్య వయసు కలిగిన ఇద్దరు పిల్లల్ని గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించారు. సుల్తాన్‌నగర్ గ్రామంలో లక్ష్మణ్ అనే వ్యక్తి ఆకస్మాత్తుగా చనిపోవడం వల్ల అతని కుమారుడైన అర్జున్ తల్లి ఊరిలో లేకపోవడం వలన పాఠశాలకు దూరమయ్యాడు. అలాగే అదే గ్రామానికి చెందిన గౌస్ అనే బాలుడు వాళ్ల తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వలస వెళ్లడంతో అతను పాఠశాలకు దూరమయ్యారని వారు తెలిపారు. వారికి పాఠశాలలో చేర్పించి ఒక్కో జత యూనిఫామ్ అందజేసినట్టు వివరించారు. ప్రతిరోజు పిల్లలకు పాఠశాలకు పంపే విధంగా తల్లిదండ్రులకు తగు కౌన్సెలింగ్ ఇచ్చినట్టు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీధర్ తెలిపారు.

కామారెడ్డిలో నవమత్ డాటా

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని బీజేపీ జాతీయ శాఖ పిలుపు మేరకు నవమత్ డాటా కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా కొత్త బస్టాండ్ వద్ద నూతన ఓటర్ల చే నరేంద్ర మోడీకి మద్దతుగా కామారెడ్డి బిజెపి నాయకులు రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపట్టారు.

మత్తు పదార్థాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

మత్తు పదార్థాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. తేలికగా డబ్బులు సంపాదించవచ్చేనే ఆలోచనతో యువత అక్రమ మత్తు పదార్థాలు రవాణాతో పాటు వాటికి బానిసలవుతున్నారని, ఆదిలోనే గుర్తించి అరికట్టాలని అధికారులకు సూచించారు. కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయుటపై గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ సింధు శర్మతో కలిసి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ ఫ్రీ తెలంగాణగా మార్చాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, మన జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం పూర్తిగా అరికట్టేందుకు పోలీస్, అబ్కారీ, వ్యవసాయ తదితర శాఖలు కంకణబద్ధులై పనిచేయాలని కోరారు. గంజాయి సాగు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, కల్లులో అల్ప్రాజోలెం కలుపకుండా కల్లు డిపోలపై గట్టి నిఘా పెట్టాలని అన్నారు. ఒక్క గ్రాము అల్ప్రాజోలెంతో 800ల లీటర్ల మత్తు కల్లు తయారు చేయవచ్చని, దీనికి బానిసైనవారు 3, 4 రోజులు తాగకపోతే ఫిట్స్ రావడం, పిచ్చిగా ప్రవర్తిస్తారని తెలిపారు. మత్తుపదార్థాల వాడకంతో ఆరోగ్యం క్షీణించడమే గాక నేరస్తులుగా మారే ప్రమాదముందని, యువత తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలన్నారు. ఇటువంటి వారిని ముందుగానే గుర్తిస్తే మానసిక వైద్య నిపుణులచే చికిత్స చేయిస్తామన్నారు. ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ..

మత్తు పదార్థాలు వల్ల జరిగే అనర్థాలపై యువతకు సానుకూల దృక్పతంతో అవగాహన కలిగించాలని, కళాశాలల దరిదాపుల్లోకి రాకుండా కట్టడి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అబ్కారీశాఖ సూపరింటెండెంట్ రవీంద్రరాజు మాట్లాడుతూ.. జిల్లాలో విస్తృత దాడులు చేస్తూ గంజాయి వంటి మత్తుపదార్థాల నివారణకు కృషి చేస్తున్నామని అన్నారు. కల్లు డిపోలకు మత్తు మందు కలపవద్దని ఆదేశించామని, ఇటువంటివి దృష్టికి వస్తే ఎవరైనా తమకు సమాచారమందించాలని, పేరు గోప్యంగా ఉంచుతామని అన్నారు. సమావేశంలో డీఈఓ రాజు, ట్రాన్స్కో ఎస్ఈ రమేష్ బాబు, డి.ఏ.ఓ. భాగ్యలక్ష్మి, వైద్యశాఖ ప్రతినిధులు వేణుగోపాల్, పద్మజ, సిడబ్ల్యుసి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రాజారెడ్డి, ఎఫ్.ఆర్.ఓ.రమేష్, డిఎస్పీ ప్రకాష్, రవాణాశాఖ ఏం.ఐ.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.టి.సి. డిపో మేనేజర్ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలి..

ఫిబ్రవరిలో జరిగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 7650, ఒకేషనల్ విద్యార్థులు 1500 మంది, ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 8034 కాగా ఒకేషనల్ విద్యార్థులు 1110 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రాక్టికల్ పరీక్షలు రెండు సెషన్స్‌లలో ఉదయం, మధ్యాన్నం జరుగుతాయని అన్నారు. 16న ఇంగ్లీష్ ప్రాక్టికల్స్, 19న ఎన్విరాన్మెంట్ పరీక్షలు జరుగుతాయన్నారు. అదేవిధంగా థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చ్ 14వరకు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఇట్టి పరీక్షల నిర్వహణకు కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుందలలో 50 కేంద్రాలలో నిర్వహించనున్నామని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష సమయానుకూలంగా బస్సులు నడపాలని, విద్యుత్‌లో అంతరాయం కలగకుండా చూడాలని, పరీక్ష పత్రాలు, జవాబు పత్రాల రవాణాలో పోలీసు భద్రత కల్పించాలని, ప్రథమ చికిత్సకు తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమవేశంలో ఎస్పీ సింధు శర్మ, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి షేక్‌సలాం తదితర అధికారులు పాల్గొన్నారు.



వేడుకలకు సిద్ధమైన కామారెడ్డి కలెక్టరేట్

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్..

కలెక్టరేట్ ఆవరణలో నిర్వహిస్తున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జితేష్, వి, పాటిల్ పరిశీలించారు. గణతంత్ర దినోత్సవానికి హాజరయ్యే అధికారులకు, అనాధికారులకు, రాజకీయ నాయకులకు, పత్రిక విలేకరులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, అధికారులకు తగు సూచనలు, సలహాలను అందజేశారు.

మండల అభివృద్ధి అధికారుల క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్..

మండల అభివృద్ధి అధికారుల సంఘం క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కామారెడ్డి జిల్లా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం అధ్యక్షులు మల్లికార్జున్‌రెడ్డి, స్టేట్ జాయింట్ సెక్రటరీ చిన్నారెడ్డి, కోశాధికారి బాలకృష్ణ, అనంత్‌రావ్, వెంకటేశం, శంకర్, బాలకిషన్, రాజవీర్, పూర్ణచంద్రోదయ కుమార్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీని సన్మానించిన మండల నాయకులు



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమాల ప్రభుత్వ సలహాదారునిగా నియమితులైన మహమ్మద్ షబ్బీర్ అలీని భిక్కనూర్ మండల నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు యూత్ మండలాధ్యక్షులు తిరుపతి గౌడ్, జనరల్ సెక్రటరీ నర్సగౌడ్, బిక్షపతి, శ్రావణ్‌రెడ్డి, జంగంపల్లి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు నరేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఐదవ తరగతి నుంచి, ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు, విద్యా బోధనతో పాటు హాస్టల్ సౌకర్యం కలదని టీజీటీ ఉపాధ్యాయులు జలీల్ బేగ్ పేర్కొన్నారు. మైనార్టీ విద్యార్థులు జనవరి 18 నుంచి ఫిబ్రవరి 6 లోపు మైనార్టీ రెసిడెన్షియల్ వెబ్‌సైట్‌లో గాని, స్థానిక ఉపాధ్యాయులకు సంప్రదించాలని ఆయన కోరారు. వివరాలకు 9949940582 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఓటర్ కార్డులు అందజేత

నవతెలంగాణ-మద్నూర్

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటర్ నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న కొత్త ఓటర్లకు ఓటర్ కార్డులను మద్నూర్ మండల తహసీల్దార్ ఎండి ముజీబ్ గురువారం అందజేశారు. అనంతరం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకర్, సీనియర్ అసిస్టెంట్ విజయ్, జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న యువ ఓటర్లు

వరి, మొక్కజొన్న పంటలు పరిశీలన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కల్వరాల్ గ్రామ శివారులోని వరి, మొక్కజొన్న పంటలను ఏ.ఓ లక్ష్మీ పరిశీలించినట్లు తెలిపారు. వరిలో మొగి పురుగు, మొక్క జొన్నలో కాండం తొలుచుపురుగు ఎక్కువగా ఆశించే అవకాశం ఉన్నట్లు ఏ.ఓ రైతులకు సూచించారు. రైతులకు వాటిని నివారించడానికి రైతులకు పిచికారీ చేసె మందుల గురించి రైతులకు వివరించినట్లు తెలిపారు.

వడ్డెర వృత్తిదారులకు బడ్జెట్లో 3 వేల కోట్లు కేటాయించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

వడ్డెర వృత్తిదారులకు బడ్జెట్లో 3 వేల కోట్లు కేటాయించాలని రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు అన్నారు. వడ్డెర వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను బుధవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పనుల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణకు తంటాలు



నవతెలంగాణ-బాల్కొండ

యాసంగి కాలం పంట రక్షణకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న , జొన్న పంటను కాపాడుకోవడానికి రైతులు రాత్రి రాత్రింబవళ్లు చాలా కష్టపడుతున్నారు. ఒక్కో రైతు ఒక్కో విధంగా తమ పంటను కాపాడడానికి చిన్నపాటి ప్రయోగాలు చేస్తున్నారు. పంటను కాపాడడానికి రైతులు మెరిసే వైరు, మెరిసే ప్లాస్టిక్ కవర్లు, గాలికి శబ్దం చేసే గంట, తదితరుల వస్తువులను కీటకాలు, పక్షుల బారి నుండి రక్షించుకుంటున్న తీరు చూపరులను ఆకట్టుకుంటుంది. మండలంలోని చిట్టాపూర్ శివారు ప్రాంతంలో జంగం అనిత అనే మహిళా రైతు గాలికి శబ్దం చేసే గంట, పంట చుట్టూ మెరిసే ప్లాస్టిక్ కవర్లు ఏర్పాటుచేసిన తీరుపై అందరూ ఆమెను ప్రశంసిస్తున్నారు.

డ్రాయింగ్, కాంపిటీషన్ పోటీలు



నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని న్యూ హరిజోన్స్ పాఠశాలలో పోలీస్ శాఖ మరియు రోడ్డు భద్రత సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రత గురించి ఎస్ఐ భాస్కరచారి సంపూర్ణంగా వివరించారు. కార్యక్రమం అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భూస రత్నాకర్, ప్రిన్సిపాల్ చంద్ర విలాస్, రోడ్డు భద్రత అధికారి స్వామి, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులకోసం పోరాడుదాం

- ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడదాం
- జనవరి 26న రాజ్యాంగం అమలు

నవతెలంగాణ-బాల్కొండ

మన స్వతంత్ర భారతదేశానికి 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ఈ సందర్భంగా మన దేశంలో రిపబ్లిక్ డే గణతంత్ర దినోత్సవం అంగరంగ వైభవంగా జరుపుకుంటాం. మన దేశానికి స్వతంత్ర రాజ్యాంగాన్ని రూపొందించడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేతృత్వంలోని ముసాయిదా కమిటీ చైర్మన్‌గా నియమించాలని తీర్మానం ఆమోదించబడింది. ముసాయిదా కమిటీలో మొత్తం 238 మంది సభ్యులు రాజ్యాంగంపై సంతకాలు చేశారు. మన భారత రాజ్యాంగంలోని మార్గదర్శకాలను రూపొందించడానికి దాదాపు రెండు సంవత్సరాల 11 నెలలు పట్టింది. చివరకు 1950 జనవరి 26న మన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ప్రస్తుతం ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన దేశం నేటికీ నిలుస్తుంది. ఈరోజు మన దేశం



వలస పాలన యొక్క సంకెళ్ల నుండి విముక్తి పొందిన దేశం. రాజ్యాంగ అమలుతో మనదేశంలో న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం విలువలు కలిగిన దేశంగా ఆవిర్భవించింది. రాజ్యాంగం అమలు కోసం ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాలు మనం ఈ రోజుకు స్మరించుకుంటాం. ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే మన దేశ ప్రజలు ఎంతో గౌరవంగా గుర్తింపు పొందుతారు. రాజ్యాంగం గుర్తింపు తర్వాత మనదేశంలో పౌరులందరూ చేసే వేడుకలే దీనికి నిదర్శనం. ఈ వేడుకలు నాయకుల బాధ్యత, పౌరుల బాధ్యతను గుర్తుచేస్తుంది. 1950లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత మన దేశంలో చాలా మార్పులు వచ్చాయి.

ప్రస్తుతం న్యాయం సమానత్వం

ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన దేశంగా భారతదేశం రెండో స్థానంలో కొనసాగుతుంది. అయితే రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాల అమలులో ప్రస్తుతం రాజకీయ ప్రమేయాలు ఉండడంతో నేటికీ పలుచోట్ల ప్రజలలో కుల, మత తారతమ్యాలు కొట్టొచ్చినట్టుగా మనకు కనబడతాయి. ధనిక, పేద వివక్ష గ్రామాలలో కొనసాగుతుంది. పలుచోట్ల ఘర్షణలు, బహిష్కరణలు నేటికి కొనసాగుతున్నాయి. భారత రాజ్యాంగం దేశం మార్పుకోసం అమలుచేసే చట్టాలు సక్రమంగా అమలు కాకపోవడం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తుంది. నేటికీ బ్రిటిష్ చట్టాలు కొనసాగించడం, వాటిని అమలుపరచడం గమనార్హం. ముఖ్యంగా మహిళ, బాలల, కార్మిక, నేరస్తుల చట్టాల అమలు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి.

సమాజంలో పౌరుల పాత్ర

రాజ్యాంగంలో ప్రజలకోసం పొందుపరిచిన న్యాయమైన సమానత్వ హక్కులపై పోరాడవలసిన బాధ్యత ప్రతి భారతీయ పౌరుడికి ఉంది. ప్రతి పౌరుడు ఎంతో ఆదర్శంగా చట్టాల అమలుకు పోరాడి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిలో మార్పు తీసుకొచ్చి ప్రజలను చైతన్య పరచడం ప్రతి పౌరుడు చేయవలసిన బాధ్యత.

భారతదేశానికి చెందిన మేధావులు నిపుణులు కలిసి భారత రాజ్యాంగంలో పాలుపంచుకున్నారు. కాబట్టి వారి ఆశయాలను గుర్తు చేసుకుంటూ ఈ గణతంత్ర దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకుందాం. చట్టాల అమలుకు కృషి చేద్దాం. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజాస్వామ్య పరిరక్షణకు ధ్యేయంగా నడుచుకుందాం.

విద్యార్థులకు బహుమతులు అందజేత

- స్టేజ్ ఫియర్ పోగొట్టేందుకు పూర్వవిద్యార్థి ప్రోత్సాహం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జడ్పిహెచ్ఎస్ నసుల్లాబాద్ పూర్వ విద్యార్థి, ప్రస్తుతం సదాశివానగర్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గూండ్ల సాయులు తాను చదివిన స్కూల్ విద్యార్థులకు స్టేజ్ ఫియర్‌ను పోగొట్టడానికి గత 40 సంవత్సరాలనుండి రిపబ్లిక్‌డే జనవరి 26, ఆగష్టు 15 నాడు ప్రోత్సహక బహుమతులు ఇస్తున్నారు. అందులో భాగంగా గురువారం బహుమతులతోపాటు 3వేల విలువగల బ్యాండ్‌ను స్కూల్ యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ టీచర్స్ ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు చందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో సిలబస్‌ను పూర్తిచేయాలి

- పిడిఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లాలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిలబస్‌ను వెంటనే పూర్తి చేయాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో డిఐఈఓకు నగర పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేవలం ఇప్పటివరకు 70శాతం మాత్రమే సిలబస్ పూర్తయిందని అన్నారు. వెంటనే పూర్తి చేయాలని, ప్రాక్టికల్ దగ్గరికి వస్తున్నాగానీ చాలా కాలేజీల్లో కెమికల్స్, ప్రాక్టికల్ పరికరాలు లేవని, సమ్మర్‌లో పేద విద్యార్థులకు ఎంసెట్, నీట్ కోచింగ్ ఇవ్వాలని తెలిపారు. పరీక్ష సెంటర్ల విషయంలో కార్పొరేట్ కాలేజీల అగడాలని అరికట్టాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సెల్ఫ్ సెంటర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర పిడిఎస్‌యూ నాయకులు వంశీ, గంగాధర్, గణేష్, సృజన్, సిద్దార్థ, నవతేజ్, శంకర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సమతుల ఆహారం అవసరం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



గర్భిణులకు సమతుల ఆహారం అవసరమని, తద్వారా శక్తి, రక్షణ ఉంటుందని, ఇదే కాకుండా పుట్టబోయే బిడ్డకు మంచి పోషకాలు అందుతాయని అంగన్వాడీ కార్యకర్తలు ఆసిఫ, శారదా, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీ అన్నారు. గురువారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ పోషణ మాసంలో భాగంగా పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పిల్లలకు అన్న ప్రాసన, సాముహిక అక్షరాభ్యాసం చేసిన అనంతరం అవగాహన కల్పించారు. గర్భిణులు విటమిన్ లోపం వల్ల వచ్చే అనర్థాలను అర్థం చేసుకుని తక్కువ ఖర్చుతో ఆకుకూరలు తీసుకుంటూ ఉండాలని ఇదే కాకుండా నారింజ పండ్లను, ఫలాలను, పోషక ఆహార పదార్థాలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

గీత భవనం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రముఖ ధార్మిక సంస్థ అఖిల భగవద్గీత కేంద్ర ప్రచార మండలి ఐదేళ్ల నూతన కార్యవర్గాన్ని గురు వారం రైల్వే స్టేషన్ రోడ్డు గీత భవనంలో ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షులు నరేంధర్ రావు తెలిపారు. అధ్యక్షుడు యంఎస్. నర్సింహ చార్యులు, ప్రధాన కార్యదర్శి మేడిచర్ల ప్రభాకర రావు, ఉపాధ్యక్షుడు యోగ రామచంద్రం, కోశాధికారి ఆరెట్టి లక్ష్మీనారాయణ, ఉప కార్యదర్శులుగా జనగామ చంద్రశేఖర శర్మ , పి.గంగాధర్, బోధన్ కార్యదర్శిగా అశోక్ కులకర్ణి, నిర్మల్ కార్యదర్శిగా వెంకట రమణ, గవర్నింగ్ సభ్యులుగా బొడ్డు దయానంద్, షేర్ల దయనంద్ వెంకట స్వామి జిఎం శంకర్ అశోక్ శ్రీనివాస్ తదితరులను ఏక గ్రీవంగా ఎన్నికున్నారు. వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నర్సింహ చారి మాట్లాడుతూ.. భగవద్గీతను విస్తృత ప్రచారం చేసి కళాశాల పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక వేసవి అవగాహన శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల అధికారిగా ప్రముఖ న్యాయ వాధి ఎంఎస్ శ్రీహరి వ్యవహరించారు. లోక కల్యాణం కోసం పుష్య పౌర్ణిమ గీత యజ్ఞం చేశారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

నవతెలంగాణ-బాల్కొండ

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా గురువారం బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44 పై రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ ఎస్సై సిహెచ్ భాస్కరాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు నియమాలు వివరిస్తూ పలు సూచనలు చేశారు. రోడ్డు భద్రత నియమాలు గురించి తెలుపుతూ వాహనదారులు సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రాంగ్ రూట్లో ప్రయాణించవద్దని, అతి వేగంగా వాహనాలను నడపరాదని అన్నారు. ఎదురుగా ఉన్న వాహనానికి 50 అడుగుల దూరంలో వాహనాన్ని నడపాలని అన్నారు. పదే పదే వాహనాలను ఓవర్టేక్ చేయవద్దని సూచించారు. పెట్రోల్ బంకుల వద్ద రోడ్డుపైనే వాహనాలు నిలుపరాదని తెలిపారు. అత్యవసరసమయంలో డయల్ 100 ఉపయోగించాలని అన్నారు. కార్యక్రమంలో బాల్కొండ పోలీస్ సిబ్బంది జయవంతరావు, సాయికుమార్, మల్లేష్ యాదవ్, సుమన్, ఎస్ హెచ్ఏఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐడి కార్డులు అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ టీ-సెర్ప్ మంజూరు చేసిన గుర్తింపు ఐడి కార్డులను గురువారం ఐకేపీ ఏపీఎం ప్రసాద్ రావ్ వివోఏ లకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ విధులను గుర్తించి ఐడి కార్డులు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందని వీవోఏల మండల అధ్యక్షురాలు అరుణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపిఎం ప్రసాద్ రావ్, ఐకేపీ సీసీ ప్రణీత, వీవోఏలు అరుణ, కావ్య అర్చన, భాగ్యలక్ష్మి, రాధిక, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మహిళా సంఘాల విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు జిల్లా సమస్య కార్యదర్శి వనిత గుర్తింపు కార్డులను గురువారం అందజేశారు. కొన్ని ఏళ్లుగా పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రాజెక్టు డైరెక్టర్ చందర్ నాయక్ ఆదేశాల మేరకు మండల మహిళా సమ్యై ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు తయారుచేసి మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల అధ్యక్షులు, ఏపియం రవీందర్ రెడ్డి, డిఎంజి జనార్ధన్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల సమైక్య సిబ్బంది వీవోఏలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా, వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కటారి రాములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను వెంటనే ఉపసంహరించుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, అదేవిధంగా ఉచిత బస్సు ప్రయాణం మూలంగా నష్టపోతున్న కార్మికులకు జీవన భృతి నెలకు 4500 కల్పించాలని, మూడు నెలల ఈఎంఐ మారిటోరియం ప్రకటించాలని అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి సౌకర్యాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం తరహాలో కమిషన్ లేకుండా రుణం ఏర్పాట్లు చేయాలని, యాప్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, నర్సయ్య ఆటో యూనియన్ నాయకులు కృష్ణ, జావిద్, అంజయ్య ఆటో కార్మికుల పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ఉప్లూర్‌లో అన్నవితరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో గురువారం పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక శ్రీ షిరిడి సాయి బాబా ఆలయం వద్ద భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. సాయి బాబా ఉత్సవ విగ్రహంతో భక్తులు ఆలయం చుట్టూ పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నందగిరి దయానంద్, పోలేపల్లి లచ్చయ్య, బద్దం గంగారెడ్డి, ఎనుగందుల శశిధర్, పసుపుల రాజేందర్, పెంబర్తి నరేష్ కుమార్, పోతు మురళి, మాసం రాజేశ్వర్ గౌడ్ , పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవన్, కోటగల్లి వద్ద క్యాలెండర్, స్టిక్కర్ల గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న, ఎం.సుధాకర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కనీస వేతనాల 5 జీవోల గెజిట్ చేయాలని, మిగతా 68 షెడ్యూల్డ్ జీవోలు పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు సవరించాలన్నారు. ఆటో, మోటార్, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. యూనివర్సిటీ, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల నాన్‌టీచింగ్, వర్కర్లకు, మున్సిపల్, గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆవిష్కరణలో ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్,ఎం.వెంకన్న జిల్లా సహాయ కార్యదర్శి బి. మల్లేశ్, జిల్లా నాయకులు డి.కిషన్, బి.మురళి సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమ పక్షోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జనవరి 14 నుండి 30 వరకు ప్రతి ఏటా జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈరోజు కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ రాజీవ్ గాంధీ హనుమంతు ఐఏఎస్ జంతు సంక్షేమం పట్ల అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్, అదనపు కలెక్టర్ రెవెన్యూ, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, జిల్లా పశువైద్య పశుసంవర్ధకఅధికారి, పశుసంవర్ధక సహాయ సంచాలకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జంతు సంక్షేమ పట్ల అవగాహన పెంపొందించుకుని మూగజీవాల పట్ల జాలి, కరుణ, దయ కలిగి ఉండాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థుల్లో జంతు సంక్షేమ పట్ల అవగాహన పెంపొందించుటకు కృషిచేయాలని సంబంధిత అధికారులకు పిలుపునిచ్చారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా, విద్యాశాఖ సహకారంతో విద్యార్థులకు జంతు సంక్షేమం గురించి వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ వి.జగన్నాథ చారి, జిల్లా పశు వైద్య పశుసంవర్ధక అధికారి తెలిపారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

- విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అందరూ ఉన్నత శిఖరాలను అవరోధించాలని నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ విజయ్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లి బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 3న సావిత్రిబాయి పూలే 193వ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పట్టణ వన్ టౌన్ సిఐ విజయ్ హాజరై విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని, అందుకు తగిన కృషి చేయాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 1831 జనవరి 03 న జన్మించి మహిళల జీవితాలలో వెలుగులు నింపిందని ఆయన అన్నారు. ఈ తరం విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజం



బహుమతి అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో

కోసం తన భర్త నుండి చదువు నేర్చుకుని అనేక ఇబ్బందులు ఎదుర్కొని మొదటి మహిళా టీచర్ గా విద్యానేర్పారని అన్నారు. పేదలకు ఉచిత విద్యను అందించాలని నాగపూర్‌లో విద్యాలయాలు స్థాపించారని తెలిపారు. సత్యశోధక సమాజం ఏర్పాటు చేసి బాల్యవివాహాలను, అంటరానితనన్ని అంతం చేయాలని సంకల్పించారన్నారు. రెండు వేల మంది అనాథలను దత్తత తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ మాధవి మేడం మరియు ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు విశాల్ నగర ఉపాధ్యక్షులు దీపిక సందీప్ వేణు ఎస్ఎఫ్ఐ నగర నాయకులు బాబురావు, వరదరాజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు మహిత ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి



డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి)లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ పాఠశాలకు చెందిన మహిత జాతీయ బేస్బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సంగీత గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైందని, ఛత్తీస్ గడ్ రాష్ట్రంలోని కోర్బా జిల్లాలో ఈనెల 28 నుంచి 1 వరకు జరిగే 67వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బేస్‌బాల్ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరాజరెడ్డి, పీఈటీ జ్యోత్సన, దమయంతి, హౌస్ టీచర్స్ మహితను అభినందించారు.

550 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత



ఎండుగంజాయి పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 550 గ్రాముల ఎండు గంజాయి పట్టుకున్నట్లు నిజామాబాద్ జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ విలాస్ గురువారం తెలిపారు. నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అధికారి సీఐ విలాస్ వివరాల ప్రకారం.. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నిజామాబాద్ ఆదేశాల మేరకు, డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ నిజామాబాద్ సిఐ విలాస్ ఆధ్వర్యంలో గర్బాబడి నిజామాబాద్ ఏరియాకి చెందిన కోరి కమల్ సింఘ్ పాన్ షాపులో తనిఖీ చేయగా 550 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడిందని చెప్పారు. అక్రమంగా కలిగి ఉండి, విక్రయిస్తున్న కారణంగా 550 గ్రాముల గంజాయిని సీజ్‌చేశారు. తదుపరి చర్యల నిమిత్తం నేరస్తుణ్ణి అరెస్ట్ చేసి ఎస్‌హెచ్‌ఓ నిజామాబాద్ నందు అప్పజెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ గంగాధర్, సిబ్బంది సలీం, సాగర్ రావ్, గోపి, కార్తిక్, కిరణ్ కుమార్, నీలీరాజు పాల్గొన్నారు.

నాట్య పురస్కారం అందుకున్న విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాలకు చెందిన విద్యార్థిని ఉట్నూరు శివానిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈనెల 23వ హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జరిగిన కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కల్చరల్ అండ్ ఈవెంట్ ఆర్గనైజేషన్ ప్రోగ్రామ్స్ లో పాఠశాలకు చెందిన విద్యార్థిని ఉట్నూరు శివానికి నటరాజ నంది శివ నాట్య పురస్కార్, 2024 నంది అవార్డును నిర్వాహకులు అందజేశారు. ఈ మేరకు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నాట్యంలో నటరాజ నంది శివ నాట్య పురస్కార్, 2024 నంది అవార్డును అందుకున్న శివానిని ప్రధానోపాధ్యాయులు సాయన్న, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించి సత్కరించారు.

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొంటారని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నూతనంగా ప్రారంభించిన నియోజకవర్గ అధికారిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొదటిసారి గణతంత్ర దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హాజరుకానున్నారని అన్నారు.

కామన్ స్కూల్ విద్యావిధానాన్ని అమలు చేయాలి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) నాయకులు అన్నారు. గురువారం పీడీఎస్‌యూ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ డైట్ కాలేజీలో 'విద్యారంగసమస్యలు - పరిష్కారాలు" అనే అంశంపై నగర అధ్యక్షులు ఎస్కే అషర్ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్తగా వచ్చిన పీడీఎస్‌యూ రాష్ట్ర మాజి ఉపాధ్యక్షులు ఎం.సుధాకర్ మాట్లాడుతూ... పాలకవర్గాలు విద్యారంగంపై బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తూ పోతున్నాయన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని ఆరోపించారు. విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్లో 10శాతం, రాష్ట్ర బడ్జెట్లో 30శాతం నిధులు ఇవ్వాలన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. శాశ్వత భవనాలు, మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించడం సరైన విధానం కాదని, తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలన్నారు. కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సమాజంలో శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించేలా ఛాత్రోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్ మాట్లాడుతూ ప్రైవేటు యూనివర్సిటీలను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వాలే కార్పొరేట్ విద్యను పెంచి పోషించడం సిగ్గుచేటన్నారు. విద్యా కార్పోరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ఉపాధ్యాయులు, డైట్ కాలేజీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గత 25 సంవత్సరాలుగా దళితుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తున్న మాల మహానాడు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లయ్య అని, వారి సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీ మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం హైదరాబాద్ లోని ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తలమల హసేన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబురావు, రాష్ట్ర కార్యదర్శులు జానయ్య, మన్నె కిష్టయ్య, నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల కిష్టయ్య, నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంది వినయ్ కుమార్, జాతీయ కార్యదర్శి మంచాల వెంకటస్వామి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



నవతెలంగాణ-రామారెడ్డి

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ప్రమాదవశాత్తు మరణించగా గురువారం మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బాధిత కుటుంబ సభ్యులకు కామారెడ్డిలో చెక్కును అందజేశారు. మద్దికుంటకు చెందిన గజ్జల లింగం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో తన పొలంలో మృతి చెందగా, పార్టీ ప్రమాద బీమా రూ.2లక్షల విలువగల చెక్కును లింగం భార్య గజ్జల తులసవ్వకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు బొమ్మిడి రామ్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు గడ్డం చిన్న రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కామెల్ల నరేందర్, మైసి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
శుక్రవారం | జనవరి 26, 2024 | www.navatelangana.com

ఘనంగా అంబరీశుని జాతర



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని భూంపల్లి గ్రామంలో అంబరీశుని జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంబు లలిత బాయి, ఉపసర్పంచ్ పసుల సాయిలు, ఎం.పి.పి గైని అనుసూయ, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం

- అందుకు ఓటు హక్కును వినియోగించుకోవాలి
- సూచించిన అధికారులు
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం
- అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞ



మాచారెడ్డి : ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్



వర్ని : ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్



బోధన్ : విద్యార్థికి బహుమతి అందజేత

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దామని అధికారులు సూచించారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీలు చేపట్టారు. ప్రధాన చౌరస్తాల్లో ప్రతిజ్ఞ చేయించారు.

పిట్లం : 18 సంవత్సరాలు నిండిన వయోజనులందరికీ ఓటు హక్కుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ నరేష్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయా శాఖల ప్రభుత్వ ఉద్యోగులతో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు లేని వయోజనులందరిని గుర్తించి ఓటు హక్కు వినియోగించుకునేలా శ్రమిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దామని అన్నారు. ఓటు హక్కు భవిష్యత్తుకు మంచి బాటలు వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి దేవిసింగ్, ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రెటరీ యాదగిరి, సిబ్బంది, బాల బాలికలు పాల్గొన్నారు.

మాచారెడ్డి : పాల్వంచ మండలంలోని భవానిపేట గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ మద్దెల రాజు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికలలో నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. మతం, జాతి, కులం, వర్గ, భాష ఎటువంటి ఒత్తిడికి ప్రభావితం కావద్దని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గంతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆశన్నగారి రమేష్‌గౌడ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ పర్వీన్ బేగం, వార్డు సభ్యులు ఉషన్నగారి సాయగౌడ్, సత్తవ్వ, రాజమణి, శారద, కారోబార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగంపేట్ : బుల్లెట్ కంటే బ్యాలెట్ బలమైందని లింగంపేట్ తహసీల్దార్ సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రధాన వీధుల గుండా విద్యార్థులతో ర్యాలీతో వెళ్లి స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి పలువురి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వేయడం మన బాధ్యత అన్నారు. దేశంలోని ఓటర్లను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న భారతదేశంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతిజ్ఞ చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీఓ ప్రభాకర్ చారి, ఎస్సై ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, డిప్యూటీ తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, ప్రజాప్రతినిధులు, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు అనేది మన హక్కు : తహసీల్దార్ నారాయణ

వర్ని : ఓటు అనేది మన హక్కు అని తహసీల్దార్ నారాయణ అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎస్ఎన్‌పురం గ్రామ పంచాయతీలో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని ఓటును ప్రతి ఒక్కరు వినియోగించుకోనేలా ప్రజలకు తెలిపే బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నేమని నాగమణి వీర్రాజ్, ఉపసర్పంచ్ కంది కృష్ణ, వార్డ్ సభ్యులు, సెక్రటరీ సాయిలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రశాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ పోటీలో విద్యార్థుల విజయం..

జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గం స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో జడ్పిహెచ్ఎస్ చందూర్ పాఠశాలకు చెందిన జి.తారకేశ్వరి పదవ తరగతి వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో ఎస్.కీర్తన ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మెమొంటోలు, సర్టిఫికెట్ అందజేసి సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

వ్యాసరచన పోటీలో విద్యార్థి ప్రతిభ

బోధన్ : జాతీయ ఓటరు దినోత్సవం సంధర్భంగ విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) రాకాసిపేట్ పదవ తరగతి విద్యార్థి శ్రీకాంత్ ప్రథమ స్థాయిలో నిలిచారు. విజేతగా నిలిచిన విద్యార్థికి జిల్లా కేంద్రంలో జేసీ చేతుల మీదుగా బహుమతి పొందాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, హెచ్ఎం బాలచంద్రం విద్యార్థికి అభినందించారు.

కుర్నాపల్లి పాఠశాలలో ప్రతిజ్ఞ..

ఎడపల్లి : మండలంలోని కుర్నాపల్లి ఉన్నత పాఠశాలలో ఎంపీటీసీల ఫోరం ఎడపల్లి మండల అధ్యక్షులు వెంకయ్యగారి రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓటర్ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ శివలింగ్ గాలప్ప, ఉపాధ్యాయులు రామకృష్ణ, తుకారాం, శ్రీనివాస్‌రెడ్డి, అనుపమ, సునీత, ప్రవీణ్, అరుణ, గోపాల్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, నీలా కుమారి, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రతినిధి కల్పన, రవళి పాల్గొన్నారు.

పొతంగల్ : మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : ఓటుహక్కు వజ్రాయుధమని తహసీల్దార్ సంజయ్‌రావు అన్నారు. మండల కేంద్రంలో జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ సంజయ్‌రావు, జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా వద్ద మానవహారాన్ని నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శారదా, డిప్యూటీ తహసీల్దార్ రేఖ, ఎంపీడీవో చిన్నారెడ్డి, సర్పంచ్ నల్ల అంజలి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ఉషశ్రీ, రెయిన్బో పాఠశాలలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి వారికి బహుమతులు అందజేసినట్టు పాఠశాల కరస్పాం డెంట్లు రాజేశ్వర్‌గౌడ్, నసీరుద్దీన్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం రిలయన్స్ కంపెనీ ఆధ్వర్యంలో తమ పాఠశాలలోని విద్యార్థులకు క్రీడ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, రిలయన్స్ కంపెనీ నిర్వాహకులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రాఘవపల్లిలో లెవలింగ్ వర్క్ పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని రాఘవపల్లి గ్రామంలో కొనసాగుతున్న లేవలింగ్ వర్క్ పనులు గురువారం ఎంపీడీవో రఘు పరిశీలించారు. పనులపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా జలాల్పూర్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న నర్సరీని ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పశు పెంపకంపై దృష్టి పెట్టాలి

- జిల్లా పశువైద్యాధికారి సింహారావు



నవతెలంగాణ-లింగంపేట్

రైతులు పశు పెంపకంపై దృష్టి పెట్టాలని పశువుల పెంపకం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని జిల్లా పశు వైద్యాధికారి సింహారావు సూచించారు. గురువారం మండలంలోని మోతే గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కామారెడ్డి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సన్న చిన్న కారు రైతులు పశుసంపద పెంచితే ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందన్నారు. రైతులు ఆర్థికంగా ఎదుగుతారని మేలు చేకూరుతుందని వివరించారు. అదేవిధంగా ప్రభుత్వం పశువులకు దానకొరకు గడ్డి విత్తనాలు ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. జిల్లాలోని మోతే గ్రామాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ దత్తత తీసుకుందని ఆయన అన్నారు. ప్రతి 15 రోజులకు ఓసారి మోతే గ్రామంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈ అవకాశాన్ని పశు పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం లింగంపేట్ మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.రవికుమార్, డాక్టర్ రవికిరణ్ పశువులకు చికిత్సలు 15 పశువులకు కృత్రిమ గర్భాధారణ, 25 పశువులకు సాధారణ చికిత్సలు, 45 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ వైద్య శిబిరంలో సర్పంచ్ ఏలేటి రామ్‌రెడ్డి, ఎంపీటీసీ జగదాంబ, సిద్దిరాములు, పాల సేకరణ అధ్యక్షులు ఈశ్వర్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ కృష్ణ, గోపాలమిత్రులు ఎజాజ్, మల్లేష్, రమేష్, బ్రహ్మం, మహిపాల్‌రెడ్డి, శివలాల్, వెంకట్, పశువైద్య సహాయకులు రవి, పాల సేకరణ డైరెక్టర్ స్వామి, పశుపెంపకందారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై బెల్టులు వితరణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని చీనురు గ్రామంలో గల విద్యార్థిని విద్యార్థులకు గురువారం టై బెల్టులు వితరణ చేసినట్టు పాఠశాల ఉపాధ్యాయులు కిష్టయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చకిలం సుశీలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు చకిలం ప్రవీణ్ కుమార్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు టై బెల్టులు వితరణ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, నాగలత, సర్పంచ్ సౌందర్య గ్రామస్తులు పాల్గొన్నారు.

బోరు మోటర్ ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామపంతాయతీ పరిధిలో గురువారం జీపీ నిధులతో బోరు వేసినట్టు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నీటిసమస్య తలెత్తకుండా ముందస్తుగా సమస్య తీవ్రంగా ఉన్న కాలనీ వద్ద బోరు పనులను ప్రారంభించినట్టు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి లక్ష్మన్ పటేల్, సర్పంచులు వినోద్, విండో డైరెక్టర్ విఠల్ పటేల్, కాంగ్రెస్ నాయకులు రామన్న, చోప్రా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కల్పించాలి

- ఎంపీడీవో వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-పిట్లం/నాగిరెడ్డిపేట్

విశ్వకర్మ యోజన పథకంపై పూర్తి అవగాహన కల్పించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విశ్వకర్మ యోజన పథకంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని విశ్వకర్మల జాబితాలు సిద్ధం చేసి కులాల ప్రతిపాదికన చేస్తున్న పనులను బట్టి ప్రతి ఒక్కరికి నైపుణ్యతను గుర్తించి వారికి లబ్ధిచేకూరేలా ప్రోత్సహించి దరఖాస్తులను స్వీకరించాలని అన్నారు. అనంతరం పంచాయతీ సెక్రటరీలతో లాగిన్ పాస్వర్డ్ క్రియేట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై గురువారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ లాగిన్ పాస్వర్డ్ క్రియేట్ చేయడం వంటి పలు అంశాలు పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, ఎంపీ శ్రీనివాస్ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పనులు సాగట్లే..

- ప్రమాదాలకు నిలయంగా మహమ్మదాబాద్-జుక్కల్ రోడ్డు
- దుమ్ము, ధూళితో అనారోగ్య సమస్యలు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామం నుంచి జుక్కల్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. అడుగుకో గుంత ఏర్పడంతో వాహనదారులు ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే జంకుతున్నారు. దీనికి తోడు భారీ వాహనాలు ఈ రోడ్డు గుండా వెళ్లే సమయంలో దుమ్ము, ధూళీ ఎగిసిపడుతోంది. తద్వారా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామం నుంచి జుక్కల్ వెళ్లే రోడ్డు గుండా వెళ్లాలంటే వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొన్నేండ్లుగా రోడ్డు గుంతలు ఏర్పడి కంకర తేలింది. తద్వారా ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం ఈ రోడ్డు గుండా వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇదిలా ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల ముందు రోడ్డు వేసేందుకు తవ్వకం పనులు చేపట్టి.. కేవలం సన్నం కంకరవేసి వదిలేశారు. నిర్మాణం పూర్తి చేయలేదు. దీంతో వాహనాదారులకు ఇబ్బంది మరింత పెరిగిందే తప్పా.. తగ్గింది లేదు. రోడ్డుపై కంకర వేయడంతో ద్విచక్రవాహనాలు స్కిడ్ అయి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును వెంటనే బాగుచేయాలని కోరుతున్నారు.



అభివృద్ధి పనులు చేపట్టాలి

- ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కాంగ్రెస్ నాయకుల విన్నపం



ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అదేవిధంగా వారసంతలో రోడ్డు పనులు ప్రారంభించాలని, అలాగే బాలికలు ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ మండల నాయకులు గురువారం ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రావును ఆయన నివాసంలో హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పనులు వెంటనే ప్రారంభించాలని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా వారం రోజులు పాటు జరిగే మత్తడి పోచమ్మ జాతర మరో రెండు నెలలలో సమీపిస్తుండడంతో భక్తుల సౌకర్యార్థం రాకపోకలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి తపాలా శాఖ కార్యాలయం వరకు వార సంత రోడ్డు లేకపోవడంతో సంతకు వచ్చే ప్రజలు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆ పనులు నిలిచిపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లింగంపేట్ సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ బుర్ర నారాగౌడ్, కాంగ్రెస్ నాయకులు సాయిరాం యాదవ్, రాజు, కుద్దూస్, కిరణ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య అభివృద్ధి సలహా కమిటీ సమావేశం



మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ రజిని కిషోర్ అధ్యక్షతన ఆరోగ్య అభివృద్ధి సలహా కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు మారు ఈ సమావేశం నిర్వహిస్తారని, ఆస్పత్రి అభివృద్ధి కోసం ప్రతియేటా రూ.1,51,000 నిధులు రావాల్సి ఉండగా, ఈ ఏడాది కేవలం రూ.75,950 మాత్రమే మంజూరయ్యాయని ఆమె పేర్కొన్నారు. ఈ డబ్బులతో అత్యవసరమైన పనులు చేసుకోవాలని ఆమె ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఈ ఏడాది ఆసుపత్రి ఖర్చులకోసం రూ.1,55,300 ఖర్చు చేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి మేక విజయ సంతోష్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ విద్య, డాక్టర్ వినయ్‌కుమార్, ఎంపీడీవో శంకర్, హెచ్ఈవోలు కరిపి రవీందర్, శ్రావణ్‌కుమార్, ఆరోగ్య సూపర్‌వైజర్ మాలంబి, ఫార్మసిస్ట్ రామచందర్, సీనియర్ అసిస్టెంట్ అశ్ఫక్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల రంగవల్లులు



ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్‌లో విద్యార్థులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు జాతీయతాభావం ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. అలాగే క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం రోజు బహుమతులు అందిస్తామని కరస్పాండెంట్ రాజు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం భవాని పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ నాయకులు



నాగిరెడ్డిపేట్ : బూత్‌లెవల్ శిక్షణకు తరలిన నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం రాష్ట్ర రాజధానిలో నిర్వహించిన బూత్ స్థాయి సమావేశానికి వాహనంలో పెద్ద ఎత్తున బయలుదేరారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసింది. హైదరాబాద్ తరలిన వారిలో లింగంపేట్ సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ బుర్ర నారా గౌడ్, రాష్ట్ర మైనార్టీ నాయకులు రఫీ, ఫతియోద్దీన్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు గోవింద్, సోషల్ మీడియా జిల్లా ఇన్చార్జ్ సాజిద్, కాంగ్రెస్ మండల నాయకులు దశరథ నాయక్, వార్డు సభ్యులు మంద ప్రసాద్, సాయిరాం, సిద్దు కిరణ్, రాజు, మోహన్‌సింగ్, ఫుల్‌సింగ్, కుద్దూస్, నరేష్, బాలాగౌడ్, సాయిలు, ఆయా గ్రామాలకు చెందిన బూత్ కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశానికి కాంగ్రెస్ మండల నాయకులు భారీగా తరలివెళ్లారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు కార్యక్రమానికి తరలి వెళ్లినట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. హైదరాబాద్ తరలిన వారిలో లక్ష్మణ్, ఇమామ్, విక్రమ్, చంటి, వెంకట్, మల్లేశం, ఆరీఫ్ తదితరులున్నారు.

పొతంగల్ : మండలంలోని బూత్ లెవెల్ కన్వీనర్లు హైదరాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ బూత్‌లెవల్ శిక్షణ శిబిరానికి తరలివెళ్లారు.

బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని అంబరిపేట బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సిరికొండా లింగారెడ్డి గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణించారు. దీంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మాజీ ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం 2లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్కును బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సలీమ్, నాయకులు ఉన్నారు.

ఢిల్లీలో పరేడ్‌కు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి



నవతెలంగాణ-సిరికొండ

రేపు 26 న ఢిల్లీ లో జరిగే రిపబ్లిక్ డే పెరేడ్ ను తిలకించడానికి జిల్లా నుండి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠ శాల సిరికొండలో 9వ తరగతి చదువు తున్న ముఖేష్ ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయులు కల్పన తెలిపారు. పరేడ్ తో పాటు ప్రధాన మంత్రి కార్యాలయ సందర్శన , ప్రధాన మంత్రితో భేటీ, ఢిల్లీలోని ప్రముఖ చారిత్రాత్మక ప్రదేశాల సందర్శన కూడా ఉంటుందన్నారు. ప్రతిభ గల విద్యార్థి అయినందున పెరేడ్ కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

రెండవ రోజు పీజీ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ మూడు, ఐదు, ఏడు, తొమ్మిది సెమిస్టర్ పరీక్షలు గురువారం రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి.

యూనివర్సిటీ లోని కాలేజీ, లా కాలేజీ, దక్షిణ ప్రాంగణం, గిరిరాజ్ డిగ్రీ కాలేజీ, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్ష కేంద్రాలను అకడెమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్. గంటా చంద్ర శేఖర్ పరిశీలించారు. ఉదయం పరీక్షకు 1709 అభ్యర్థుల కు గాను 1613 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్ష కు 181 మందికి 180 హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న చంద్ర శేఖర్

నేడు కమ్మర్‌పల్లికి ఎమ్మెల్యే వేముల రాక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం మండల కేంద్రంలో పర్యటిస్తున్నట్లు టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.మధ్యాహ్నం 12గంటలకు స్థానిక కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్లబ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి షటిల్ టోర్నమెంట్ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రశాంత్ రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు.ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలి

- తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వనపర్తి జిల్లా కేంద్రంలో ఈనెల 28న నిర్వహించే తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని, పెద్దసంఖ్యలో పంచాయతీ వర్కర్లు హాజరు కావలని ఐఎఫ్టియు జిల్లా నాయకులు మురళి సూచించారు. గురువారం మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న పంచాయతీ వర్కర్లను ప్రభుత్వం పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత చేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పంచాయతీ కార్మికులందరికీ పీఎఫ్, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎయు నాయకులు రాజేందర్, అశోక్, నర్సయ్య, పోసాని, రాజేశ్వర్, బాబు, శ్యాంసన్ పాల్గొన్నారు.

29న ఉచితంగా రేబిస్ టీకాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పశువుల సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో ఈనెల 29న సోమవారం ఉచితంగా రేబీస్ టీకాలు వేయడం జరుగుతుందని అసిస్టెంట్ డైరెక్టర్ జియాఉద్దీన్, వెటర్నరీ అసిస్టెంట్ రోజాశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వడ్డెర వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భిక్కనూర్



పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో గురువారం వడ్డెర వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్ ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం అధ్యక్షులు కొమ్మరాజుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మహేష్, సంఘం సభ్యులు ప్రభాకర్, రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా..

- సాలూర మండల కేంద్రంలో స్వేరోస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ప్రారంభం
- లైబ్రరీ ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-బోధన్

జ్ఞానవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలో శుక్రవారం స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. నేటి యువత దురలవాట్లతో వారి భవిష్యత్తును నాశనం చేసుకోవడమే కాకుండా, ఆర్థికంగా తీవ్ర నష్టాల పాలవుతున్నారు. అలాంటి యువత చదువుపై దృష్టిసారించి ఉపాధి మార్గాలను, ఉద్యోగ అవకాశాలను పొందడానికి గ్రామానికి చెందిన స్వేరోలు లింబూరి లక్ష్మణ్, సింగడి పాండు, సాలెన్ సంజీవ్ సమాయత్తమై గ్రామస్తులతో చర్చించి గ్రామపంచాయతీ స్థలంలో గత నాలుగు సంవత్సరాలు క్రితం అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి పునాది వేశారు. కొన్ని అనివార్య పరిస్థితుల వలన, కరోనా ఇబ్బందులతో ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వచ్చింది. నేడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయడానికి కార్యచరణ రూపొందించారు. అందులో భాగంగా గణతంత్ర దినోత్సవం జనవరి 26న ఘనంగా అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం చేపడుతున్నారు. కార్యక్రమానికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్వేరోస్ అనుబంధ విభాగాల నాయకులు కోఆర్డినేటర్లు తరలివస్తున్నారు. ఈ లైబ్రరీలో యువతకు కావలసిన పుస్తకాలను, పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను దాతల సహాయంతో సేకరించడం, లైబ్రరీకి కావాల్సిన వస్తువులను దాతల సహాయంతో కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఎంపీపీ బుద్దె సావిత్రి, గ్రామపెద్దలు బుద్దే రాజేశ్వర్, లైబ్రరీ ప్రారంభోత్సవానికి వారి సంపూర్ణ సహకారం అందించారు. గ్రామంలో చాలా సంవత్సరాల తర్వాత లైబ్రరీ ఏర్పాటు కావడంతో అది కూడా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రారంభోత్సవం కావడానికి ఏర్పాట్లు చేయడంతో గ్రామస్తులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

బ్లాక్ స్పాట్ల గుర్తింపు

- ఎన్‌హెచ్ ఎఐ పిడి శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసిపి నారాయణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జాతీయ రహదారుల వెంట బ్లాక్ స్పాట్లను గుర్తించామని త్వరలోనే ప్రమాదాల నివారణకు చర్యలను చేపట్టడం జరుగుతుందని వాహనదారులు కూడా రాంగ్ రూట్లో వెళ్లకుండా చూడాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రం లోని ప్రైవేట్ లిమిటెడ్ టోల్ ప్లాజాలో ప్రమాదాల నివారణ పై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల సరిహద్దుల వెంట బ్లాక్ స్పాట్లను ఇప్పటికే గుర్తించడం జరిగిందని, కొన్నిచోట్ల అత్యవసరంగా ఉన్నవాటి వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా యూటర్న్లను మూసివేయటం జరిగిందన్నారు. కొన్నిచోట్ల వంతెనల నిర్మాణం జరుగుతుందని ఇంకా కొన్నిచోట్ల సర్వీస్ రోడ్లు, ఇతర మార్గాలపై చర్చిస్తున్నామని వారన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని, ఇదేకాకుండా మద్యం సేవించి వాహనాలు నడిపి లేని ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాంగ్ రూట్‌లలో వచ్చి ప్రమాదాల బారిన పడి కుటుంబాలను కోలుకోకుండా చేస్తున్నారని, అలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పోలీసులతో కలిసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ అనిల్ కుమార్, ఐఆర్‌డిఎ వర్మ, ఐటీ రామారావు, సెప్టి మేనేజర్ సతీష్, పానుగంటి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌హెచ్ ఎఐ పిడి శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసిపి నారాయణ

సిబ్బంది ఆరోగ్య రక్షణకే శిబిరం ఏర్పాటు

- ఎన్‌హెచ్‌ఎఐ పిడి శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

టోల్ ప్లాజాలో విధులు నిర్వహించే సిబ్బంది, జాతీయ రహదారి వెంట రాకపోకలు సాగించే డ్రైవర్, క్లీనర్ల ఆరోగ్య సంరక్షణకే అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని జాతీయ రహదారి 44 ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని అత్వాంగ్ డిచ్ పల్లి టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్, ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి అధ్వర్యంలో టోల్ ప్లాజాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ రావు పాల్గొని మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎన్‌హెచ్‌ఎఐ పిడి శ్రీనివాస్‌రావు

జాతీయ రహదారుల భద్రత వారోత్సవాల్లో భాగంగా టోల్ ప్లాజా సిబ్బందికి, డ్రైవర్, క్లీనర్లకు వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనారోగ్య లక్షణాలు ఉన్న వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నిజామాబాద్ ట్రాఫిక్ ఎసిపి నారాయణ, ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్ కుమార్, వైద్యాధికారి సంతోష్, టోల్ ప్లాజా మేనేజర్ చలపతి రావు, సేఫ్టీ మేనేజర్ సతీష్ పానుగంటి, ఆపరేషన్ మేనేజర్ వీరజ్, మెయింటెనెన్స్ మేనేజర్ వీరబాబు, మండల విస్తరణ అధికారి వై శంకర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, టోల్ ప్లాజా సిబ్బంది

మహిళలకు క్షణంలో బ్యాంకు సేవలు అందిస్తాం

- ఎన్‌డిసిసి బ్యాంక్ మేనేజర్



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మహిళలను ఇబ్బంది పెట్టకుండా ఒకే క్షణంలో బ్యాంకు సేవలు అందిస్తామని జక్రాన్‌పల్లి ఎన్డిసిసి బ్యాంక్ మేనేజర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మహిళా సంఘాల గ్రామ సంఘ అధ్యక్షులకు ఎన్‌డిసిసి అందిస్తున్న బ్యాంకు సేవలను మేనేజర్ తెలిపారు. మహిళా సంఘాలకు 10 లక్షల నుంచి 20 లక్షల వరకు రుణాలు అందజేస్తామన్నారు. మహిళా సంఘ సభ్యులకు మర్యాదగా రిసీవ్ చేసుకుని ఇటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకు లావాదేవీలను నిర్వహిస్తామని అన్నారు. అన్ని రకాల రుణాలను అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సమైక్య అధ్యక్షురాలు వనిత, ఏపిఎం రవీందర్ రెడ్డి, అర్గుల సింగిల్ విండో కార్యదర్శి తిరుపతిరెడ్డి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మండల సమైక్య సిబ్బంది, గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బ్యాంకులో బీమా కలిగి ఉండాలి

- గ్రామీణ బ్యాంక్ రిజినల్ మేనేజర్ పురం నవీన్ కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

18 నిండిన ప్రతి ఒక్కరూ బ్యాంకులో తప్పకుండా ఖాతా, బీమా కలిగి ఉండాలని, ఏదైన అపాయం జరిగినప్పుడు కుటుంబానికి ఆర్థికంగా సహకారం ఉంటుందని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్‌పురం నవీన్ కుమార్, ఎస్ఎంఓ సామా నాయక్, గన్నారం బ్రాంచ్ శాఖ మేనేజర్ టక్కుర్ సంతోష్ అన్నారు. గురువారం ఇందల్ వాయి మండలంలోని మెగ్యనాయక్ తండాలో బాధిత కుటుంబానికి 20లక్షల ప్రమాద బీమా చెక్కును నామినీకి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రజలకు ఏదైనా సబ్సిడీ ఇతర మార్గాల ద్వారా వచ్చే డబ్బులను నేరుగా లబ్దిదారు ఖాతాలోనే వస్తున్నాయని తెలిపారు. దీనివల్ల ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఖాతా ఉండాలన్నారు. ఖాతాతో బీమా సదుపాయాలు ఉన్నాయని, అనుకోని ఘటన ఏదైనా జరిగితే వారసులకు బీమా డబ్బులు అందుతాయని అన్నారు. తండాకు కాట్రోత్ నగేష్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో వెయ్యి రూపాయలతో ఇన్సూరెన్స్ చేసుకున్నాడని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కాట్రోత్ నాగేష్ భార్య కాట్రోత్ రజితకి 20 లక్షల రూపాయల చెక్కు అందజేశామని తెలిపారు. బ్యాంకుల ద్వారా వ్యవసాయ వ్యాపార తదితర రుణాలను తీసుకొని లబ్ధి పొందుతూనే తిరిగి క్రమం తప్పకుండా చెల్లించి బ్యాంకులకు తోడ్పాటునందించాలని తెలిపారు. సర్పంచ్ కాట్రోత్ లక్ష్మి, బీఆర్ఎస్ సినియర్ నాయకులు గణేష్ నాయక్, ఖాతదారులు, తండా వాసులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

ఇగ్నైట్ ఇండియా టీయూ కో-ఆర్డినేటర్‌గా రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో ఇగ్నైటింగ్ ఇండియా -2047 విజన్ ఆఫ్ ది డెవలప్మెంట్ పేరుతో ఫిబ్రవరి నెలలో విశ్వవిద్యాలయాలు కళాశాలలు నిర్వహించబోయే యువ మంథన్ ఎక్సిరిమెంటల్ లెర్నింగ్ కార్యక్రమానికి తెలంగాణ యూనివర్సిటీ కోఆర్డినేటర్ గా ప్రొఫెసర్ డాక్టర్ కే. రవీందర్ రెడ్డి ని నియమించినట్లు యుజిసి సెక్రటరీ దీపాలి జైస్వాల్ నియామక ఉత్తర్వులు అందజేశారు. యుజి, పిజి విద్యార్థులకు యువ మంథన్ మోడల్ యునైటెడ్ నేషన్ పేరుతో నూతన ఆవిష్కరణలు, గ్లోబల్ డిప్లమసి, స్కిల్ డెవలప్మెంట్, భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు అనే అంశాలపై వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నారని ప్రొఫెసర్ డాక్టర్. రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కో-ఆర్డినేటర్ గా రవీందర్ రెడ్డి నియామకం పట్ల రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి సీనియర్ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు సత్కారం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షన్లో భాగంగా పట్టణ మున్సిపల్ కార్మికులకు గురువారం సత్కారం చేశారు. పట్టణంలోని రాంనగర్ రామాలయ సభ్యులు కొక్కుల లింగం,కట్కం లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుడు దొండి కొబ్బని రాహుల్, తోపారం నారాయణ లను అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకముందు మరింత బాధ్యతగా విధులు నిర్వహిస్తామని తెలిపారు.



కార్మికులను సన్మానిస్తున్న రామాలయ సభ్యులు

పిఆర్ డీఈని మర్యాద పూర్వకంగా కలిసిన ఏఈ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ పంచాయతీరాజ్ సబ్ డివిజన్ ఇన్చార్జి డీఈ గా బాబురామ్ బాధ్యతలు తీసుకోవడంతో గురువారం జెడ్పి కార్యాలయంలోని డీఈ చాంబర్లో పంచాయతీరాజ్ నిజామాబాద్ రూరల్ మండల ఏఈ నరేష్, మోపాల్ మండల స్రవంతి మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల బొకే ను అందించారు.



జెండర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఏపీ రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జెండర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపిఎం రవీందర్ రెడ్డి గురువారం అన్నారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మండల మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు జిల్లా సమైక్య అధ్యక్షురాలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎం మాట్లాడు తూ జెండర్ పై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలలో గృహహింసతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి కౌన్సిలింగ్ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారిని కూడా గుర్తించి గ్రామ సంఘాల ద్వారా బ్యాంకు రుణం స్త్రీనిధి రుణాలు అందజేసి వారి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో డిఎంజి జనార్ధన్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మండలంలోని మహిళా సంఘాల అధ్యక్షులు, మండల సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ రవిందర్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం



నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో మాజీ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తని గ్రామ కమిటీ అధ్వర్యంలో గురువారం సన్మానం చేశారు. నూతనంగా ఎన్నుకో బడిన గ్రామకమిటీ సభ్యులు ఎన్నిక అనంతరం మొదటి సారిగా స్వగ్రామానికి వచ్చిన మాజీ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు నరేందర్, ఉపాధ్యక్షులు నరేష్ యాదవ్, ప్రసాద్, వార్డు మెంబర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | జనవరి 26, 2024 | www.navatelangana.com

వరద కాలువలో వ్యక్తి గల్లంతు



నవతెలంగాణ-బాల్కొండ

మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని బోదేపల్లి గ్రామంలో గురువారం ప్రమాదవశాస్తూ ఒక వ్యక్తి వరద కెనాల్‌లో పడి గల్లంతయినట్లు బాల్కొండ ఎస్సై కే గోపి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బోదేపల్లి గ్రామానికి చెందిన గడ్డం సాయన్న (58) వ్యవసాయదారుడు. గురువారం ఉదయం కరెంటు మోటార్లకు వైరు పెట్టడానికి గ్రామ శివారులో గల వరద కెనాల్ వద్ద వెళ్లి మోటారు నుండి వైర్ తీస్తుండగా ప్రమాదవశాత్తు వరద కెనాల్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. భార్య గడ్డం లింగు బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్షత్రియ పాఠశాలలో క్రీడా పోటీలు

నవతెలంగాణ-ఆర్మూర్

75 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా గురువారం మండలంలోని చేపూర్ క్షత్రియ విద్యార్థులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. క్షత్రియ విద్యాసంస్థల కోశాధికారి శ్రీ అల్జాపూర్ గంగాధర్ క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని అన్నారు. సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ.. క్రీడలలో పాల్గొనడం ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని అన్నారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ు మాట్లాడుతూ ఆటలలో గెలుపోటములు సహజమని ఒక ఓటమి మరో విజయానికి నాంది అని అన్నారు. రెండు రోజులు నిర్వహింపబడుచున్న ఈ పోటీల్లో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్ తో పాటు చిన్న పిల్లలకు ప్రత్యేక ఆటలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పట్టణంలోని టీచర్స్ కాలని లో ఉన్న క్షత్రియ పాఠశాల విద్యార్థులకు కూడా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శ్రీమతి అరుంధతి తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు వీరేంద్ర, అక్షయ్, పరీక్షిత్, వ్యాయామ ఉపాధ్యాయులు సాయినాథ్, అనూష, శ్రీనివాస్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధం

- నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- 18 ఏండ్లు నిండినవారు ఓటర్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి
- విద్యార్థులతో ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ, మానవహారం
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. 18ఏండ్లు నిండిన వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని అన్నారు.



ఆర్మూర్ : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రముఖులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ -విలేకరులు

కమ్మర్‌పల్లి:మండల కేంద్రంలో 63వ నంబర్ జాతీయ రహదారిపై తహసిల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ కూడలిలో మానవహారంతో ప్రతిజ్ఞ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పోలీస్ శాఖ, అటవీ శాఖ సిబ్బందితో కలిసి తహసిల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. ఓటరు కరపత్రాలు పంపిణీ చేస్తూ బస్టాండు కూడలి వరకు వెళ్లి మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేసి, ప్రజలకు ఓటు హక్కు పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేవా అని ఒకటికి రెండు సార్లు ఏప్పటికప్పుడు సదరు ఓటరు తనిఖీ చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్క ఓటరు నిర్భయంగా తప్పకుండా ఓటు హక్కుని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ భాస్కర్, ఎంపీడీఓ సంతోష్ రెడ్డి, ఎస్ఐ రాజ శేఖర్, ఏపీఎం కుంట గంగారెడ్డి, అటవీ రేంజ్ అధికారి రవీందర్, రెవెన్యూ సీనియర్ సహాయకులు కిరణ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శరత్, జూనియర్ సహాయకులు నరేందర్, రెవిన్యూ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :పట్టణంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు "ఓటర్ చైతన్య ర్యాలీ" నిర్వహించారు. అధికారులు, ప్రముఖులు, ఉద్యోగులు ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి 'ఓటరు ప్రతిజ్ఞ' నిర్వహించి సీనియర్ ఓటర్లను సన్మానించారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై గంగాధర్, డిప్యూటీ తహసిల్దార్ విజయకాంత్, తదితరులు పాల్గొన్నారు.

భీంగల్: ఓటు హక్కుపై 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికి అవగాహన కల్పించాలని తహసీల్దార్ వెంకటరమణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిరంజీవి తెలిపారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కూడా 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ ధనుంజయ్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ :తెలంగాణ విశ్వవిద్యాలయం సారంగాపూర్ బీఈడీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ముందుగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. రవీందర్ ఓటర్ల ప్రాముఖ్యత ను వివరిస్తూ ప్రతిజ్ఞను ఉపాధ్యాయులు, ఛాత్రోపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, బోధనేతర సిబ్బందితో చేయించారు. తదనంతరం ఓటర్ల దినోత్సవ ప్రాముఖ్యతను గురించి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రసంగించారు. అధ్యాపకులు, బీఈడీ, ఎంఈడి విద్యార్థులు ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వన్నెల దాస్ శ్రీనివాస్, పోలపల్లి శ్రీకాంత్, సువర్చల, హరిత, లింగమూర్తి, నరేందర్, గణేష్, శశి సిబ్బంది పాల్గొన్నారు.

గూపన్‌పల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శకుంతలా దేవి సమక్షంలో ఉపాధ్యాయులు విద్యార్థులు జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. పాధ్యాయులు బి.కృష్ణారెడ్డి (టిఆర్టిఎఫ్-జిల్లా అధ్యక్షులు), మంజులత, శ్రీరామ లక్ష్మణ్, అంజయ్య,ఉమాదేవి పాల్గొన్నారు.

ముప్కాల్:తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో వనజ రాణీ ఆధ్వర్యంలో రెవిన్యూ అధికారులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని కేజీబీవీ, రెంజర్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైతం విద్యార్థులతో ఓటర్ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ గంగారాం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరికొండ:ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, అది దేశం యొక్క దశ-దిశను నిర్దేశిస్తుందని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పాఠశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తదనంతరం ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ ఓటు అనే రెండు అక్షరాలకు దేశ పరిపాలన స్థితిగతులను మార్చేశక్తి ఉందని, కేంద్ర, రాష్ట్ర, చట్టసభలలో, స్థానిక స్వపరిపాలన సంస్థల్లో విప్లవాత్మకమైన మార్పులకు ఓటు హక్కు ప్రధానమైనదన్నారు. ప్రస్తుతం ఎన్నికలలో పెరిగిపోతున్న కుల, మత, ధన మద్యం ప్రాబల్యాన్ని, హింసను నిరోధించి ప్రజాస్వామ్య ప్రభావాన్ని, ఔన్నత్యాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఎంతైనా ఉందన్నారు. ప్రజాస్వామ్యం గెలవాలంటే ప్రతి పౌరుడు ఎన్నికలలో తప్పక పాల్గొనాలని, బేషజాలు తారతమ్యాలు లేకుండా ఆచితూచి భవిష్యత్తును నిర్మించే సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడం ప్రతీ పౌరుడి ప్రాథమిక హక్కే కాకుండా బాధ్యతన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైట్ ఓట్ అనే ఆంగ్ల అక్షర ఆకారంలో కూర్చొని ఓటు విశిష్టతను తెలిపారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను, పౌరుల పాత్ర ఆవశ్యకతను ప్రతిబింబించేలా రూపొందించిన గోడప్రతులను ప్రిన్సిపాల్ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గులు ఉపన్యాసం మొదలగు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్కొండ:మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చిన్నయ్య మాట్లాడుతూ ఓటు హక్కు ఒక వజ్రాయుధమని, ఓటు ద్వారానే దేశం స్థితిగతులను మార్చవచ్చని అన్నారు. ఓటు ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలిపి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు , సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాల కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ వాణి మాట్లాడుతూ ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఓటు హక్కు మన ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టు అని అన్నారు. ఇది దేశం దశ దిశను మార్చే ఆస్త్రం అని తెలిపారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

జక్రాన్‌పల్లి:నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కలీం అన్నారు. తాసిల్దార్ కార్యాలయం వద్ద అన్ని గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులు ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపిడిఓ బ్రహ్మానందం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ ఏపీఎం రవీందర్ రెడ్డి, మండలంలోని మహిళా సంఘాల అధ్యక్షులు, ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, జాతీయ ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మాక్లూర్:మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు మండల తహసీల్దార్ షబ్బీర్ అధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబివి పాఠశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం ముందు మానవహారం చేపట్టి, విద్యార్థులతో రంగోలి నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ క్రాంతి, ఎస్సై సుదీర్ రావు, సీనియర్ అసిస్టెంట్ వేణు, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారి ప్రగతి, సిబ్బంది విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో..


నిజామాబాద్‌రూరల్ : సారంగపూర్ బీఈడీ కళాశాలలో..



సిరికొండలో...



మాక్లూర్‌లో..

ఆర్ఓబీ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాదు పట్టణంలో అర్సపల్లిలో 137.5 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించే రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇందూర్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్,అర్బన్ ఎమ్మెల్యే శ్రీ ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. బిజెపి కేంద్ర ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక రోడ్స్, రైల్వేస్ అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయని, కేంద్రం తెలంగాణ అభివృద్ధి కి కట్టుబడి ఉందని, జిల్లా అభివృద్ధికి కూడా కేంద్రం నుండి పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, కార్పొరేటర్ లావణ్య నవీన్, బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రావంతి రెడ్డి, కార్పొరేటర్స్ న్యాలం రాజు, సుక్క మధు, ఎర్రం సుదీర్, సుంకరి నారాయణ, పంచారెడ్డి ప్రవళిక శ్రీధర్, మండల అధ్యక్షులు గడ్డం రాజు పుట్ట వీరేందర్ రోషన్ లాల్ బోర, బిజెపి నాయకులు బట్టికిరి ఆనంద్, మఠం పవన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ వివాదం


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని లిమ్రా గార్డెన్ లో బుధవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ షాదీ ముబారక్ చెక్కులను పంపిణి చేసిన సందర్భంగా బీజేపి, మజ్లిస్ పార్టీల మధ్య ప్రొటోకాల్ వివాదం నెలకొంది. బీజేపి నాయకులు కేవలం అర్బన్ ఎమ్మెల్యే ఫోటోతో పాటు బీజేపి నాయకుల ఫోటోలను ఫ్లెక్సీలో ముద్రించి మజ్లిస్ పార్టీకి చెందిన నాయకుల ఫోటోలను ముద్రించకపోవడంతో ఆ పార్టీ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. ఈ విషయమై తాము కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మజ్లిస్ ఇత్తెహాద్ ఉల్ ముస్లిమీన్ నిరసనలతో అధికారులు ఫ్లెక్సీని తొలగించారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, డిప్యూటీ మేయర్ ఇద్రీస్ ఖాన్, ఫ్లోర్ లీడర్, టౌన్ మజ్లిస్ అధ్యక్షుడు, జిల్లా ఆర్గనైజేషన్ ఇంచార్జి మహమ్మద్ షకీల్ అహ్మద్ ఫాజిల్, మజ్లిస్ కార్పొరేటర్ల సమక్షంలో బీఆర్ఎస్ కార్పొరేటర్, ప్రతినిధి కార్పొరేటర్లు, సహాయ సభ్యుడు, టౌన్ మజ్లిస్ సహాయ సభ్యుడు, ప్రతినిధి ముహమ్మద్ ఆబాద్‌లతో కలిసి షాదీ ముబారక్ చెక్కులను పంపిణి చేశారు.

కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి

- 27వ వార్డు కౌన్సిలర్ బదాం రాజ్ కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణంలోని 27వ వార్డు కౌన్సిలర్ బదాం రాజ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటిలో మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై ఈనెల నాల్గవ తేదీ మున్సిపల్ కార్యాలయం అవిశ్వాస తీర్మానానికి సమా వేశం నిర్వహించారని, ఈసమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ ఆద్వరములో జరిగిందని తెలిపారు. మున్సిపల్‌లో కౌన్సిలర్ ల సంఖ్య 36 సభ్యులు, ఎక్స్ అఫిషియోగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఉన్నారని పేర్కొన్నారు. అవిశ్వాసానికి 2/3 వంతు కావలసి యున్నందున.. మొత్తం సభ్యుల సంఖ్య 25 సభ్యులు కావలసి ఉంటుందని, అవిశ్వాసం నెగ్గడానికి ఆర్ డి ఓ నిర్వహించిన ఓటింగ్‌లో 25 సభ్యులు పాల్గొని అందులో 24 మంది సభ్యులు మాత్రమే అవిశ్వాసానికి వచేతులు ఎత్తి మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తటస్థంగా ఉండటం వల్ల అవిశ్వాసానికి కావలసిన సంఖ్య 25కు సరిపోనందున, మున్సిపల్ చైర్ పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగి పోయిందని భావిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ న్యాయ పరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

అయోధ్య సందర్శకులకు ఘన స్వాగతం

నవతెలంగాణ-బాల్కొండ

అంగరంగ వైభవంగా జరిగిన అయోధ్య బాల రామమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని గురువారం మండల కేంద్రానికి విచ్చేసిన విశోఖ తీర్థస్వామి, కత్రాజీ నరేందర్‌కు పలువురు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అంబటి నవీన్, ఆరేపల్లి నర్సయ్య, కోడిచెర్ల రామకృష్ణ, ఆరేపల్లి రాజేశ్వర్, సల్ల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



ఎమ్మెల్సీ కోదండరామ్‌ను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్ సన్మానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో కోదండరామును సన్మానించారు.

భీంగల్ సీఐగా శ్రీనివాస్ బాధ్యతలు

నవతెలంగాణ-భీంగల్



భీంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నాగపురి శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీలు ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్లు వీఆర్ కు వెళ్లగా నిర్మల్‌లో సీఐగా పని చేసిన శ్రీనివాస్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని సీఐ ఈ సందర్భంగా తెలిపారు.

రిపబ్లిక్ డే వేడుకకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్



నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఉదయం 9.00 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. రిపబ్లిక్ డే వేడుకకు ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు విచ్చేయనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఇదివరకే నిర్వహించిన సమీక్షలో అధికారులకు సూచించారు. వేదిక, ఎగ్జిబిషన్ స్టాల్స్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్ల గురించి పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో ఐడీఓసీలో సమావేశం నిర్వహించి కీలక సూచనలు చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు పోలీస్ పరేడ్ మైదానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.



హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ బూత్‌లెవల్ ఏజెంట్లు

- సమావేశానికి తరలిన బూత్‌ఏజెంట్లు

నవతెలంగాణ-విలేకరులు

బాల్కొండ:హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో గురువారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల రాష్ట్రస్థాయి సమావేశానికి ఉమ్మడి బాల్కొండ మండల నాయకులు తరలివెళ్లారు. ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొంటారని నాయకులు తెలిపారు. శ్రీనివాస్ గౌడ్, సయ్యద్ యునుస్, సయ్యద్ జావిద్, విక్కీ, పురుషోత్తం, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

ముప్కాల్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ప్రాంతంలోని ఎల్బీ స్టేడియంలో జరిగే బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశమనికి మండల బూత్ ఏజెంట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన, ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే సమక్షంలో జరిగే బూత్ లెవల్ స్థాయి కార్యక్రమం విజయవంతం చేసేందుకు మండలం నుంచి బూత్‌స్థాయి ఏజెంట్లతో బయలుదేరి వెళ్లినట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి తెలిపారు. వెళ్లిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ డెలిగేట్ సెక్రెటరీ జైడి చంద రవి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, బూత్ స్థాయి ఏజెంట్లు రాజ్ కుమార్, ఏలేటి విజయ్, లోక రాములు, ప్రవీణ్, మహిపాల్, చంటి, లోక సుభాష్, ప్రశాంత్, గంగాధర్, లోక నరేష్ తదితరులు ఉన్నారు.

మోర్తాడ్:హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న బూత్ లెవెల్ శిక్షణ కమిటీ సమావేశానికి బాల్కొండ నియోజకవర్గంలోని సుమారు 400 మంది 8 బస్సులలో తరలి వెళ్ళినట్లు తెలిపారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఇచ్చే సలహాలను గ్రామాల్లో అమలు చేసే విధంగా బూత్ లెవెల్ కార్య కర్తలను తరలించి నట్లు తెలిపారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామానికి నలుగురు చొప్పున తరలి వెళ్లినట్లు తెలిపారు.


మోర్తాడ్‌నుండి...


ధర్పల్లి : తరలివెళ్లిన నాయకులు

సిరికొండ : హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ సమావేశం జరుగుతున్న తరుణంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి నాయకత్వంలో సిరికొండ మండలం నుండి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాకారం రవి మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సమావేశానికి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన బిఎల్ఏల సమావేశానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నాయకత్వంలో వెళ్లినట్టు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో చురుకుగా పాల్గొనే విధంగా వారికి దిశనిర్దేశం చేయనున్నారు. కార్యక్రమంలోకాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాకారం రవి , ఎర్రన్న, మల్లేష్ యాదవ్, రోండ్ల గోవర్ధన్, గ్యామ శోభన్, నర్సారెడ్డి, అసిఫ్, బాకారం సంతు, కుందేళ్ల శ్రీనివాస్, రమేష్, రవి, సురేష్, గంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: కాంగ్రెస్ బూత్ లెవెల్ సమావేశానికి డిచ్ పల్లి, ఇందల్ వాయి మండల పార్టీ అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, మోత్కురి నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో గడిల రాములు,డిసిసి డెలిగేట్ సుధాకర్, నారాయణ్ నాయక్,మోతిలాల్, రంజిత్,మండల కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్యాంసన్, పోలసాని శ్రీనివాస్, వాసు బాబు, శ్రీనివాస్ గౌడ్, రమేష్ గౌడ్, పెద్దోల్ల శ్రీను, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

ధర్పల్లి :మండలంలోని అన్నిగ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళ్లారు. శ్రీకాంత్ రెడ్డి, గంగయ్య, అశోక్, ఆనంద్, శ్రీనివాస్ రెడ్డి, జాన్ రెడ్డి, జావీద్, గుండయ్య, తదితరులు తరలి వెళ్లారు.